మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# ముగ్గురిలో ముందడుగెవరిది..?

- ◆హ్యాట్రిక్ సాధించాలని ఆల తపన
- ◆బోణి కొట్టాలని జీఎంఆర్ ఆరాటం
- ◆డబుల్ ఇంజన్ సర్కార్ కోసం కొండా పోరాటం
- ◆ముక్కోణపు పోటీలో విజేతెవరో..!?



ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



జి మధుసూధన్‌రెడ్డి



కొండా ప్రశాంత్‌రెడ్డి

**భూత్పూర్, నవంబర్ 11, ప్రభాతవార్త:** జిల్లాలోనే ఎంతో ఆసక్తి కరంగా మారిన దేవరకద్ర అసెంబ్లీ ఎన్నికకు ప్రధానంగా ముగ్గురు పోటీ పడుతున్నారు. అధికార పార్టీ బీఆర్‌ఎస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రతిపక్ష కాంగ్రెస్ నుంచి డీసీసీ అధ్యక్షుడు, అసెంబ్లీ అభ్యర్థి జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్), బీజేపీ నుంచి కొండా ప్రశాంత్‌రెడ్డి ప్రధానంగా రంగంలో ఉన్నారు. బీజేపీ రెబల్ అభ్యర్థిగా దేవరకద్ర బాలన్న కూడా నామినేషన్ వేసి రంగంలో ఉన్నారు. మరో 18 రోజుల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ సత్తాను చాటుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ ప్రచారాల జోరును పెంచాయి. వ్యూహ, ప్రతి వ్యూహాలతో ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు కరపత్రాలు, బ్రోచర్లతో ఓటరు దేవుళ్లయిన ప్రజల ముందుకు వస్తున్నారు. నిత్యం ప్రచారాల హోరుతో సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రజలముందుకొస్తుంటే, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి 15అంశాల మ్యానిఫెస్టోతో అధికార పార్టీ బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారాలు చేస్తోంది. అధికార పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గడచిన పదేళ్ల కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రధానాస్త్రాలుగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. రెండు మార్లు గెలిచి ముచ్చటగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలనే తపనతో ఈ సారి ప్రచారంలో ఎమ్మెల్యే తనతో పాటు మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డిలతో కలిసి భూత్పూర్ పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో విస్తృత స్థాయి ప్రచారం సాగిస్తున్నారు. ఈ సారి ఆల తన కుటుంబ సభ్యుల్ని కూడా రంగంలో దించడంతో అధికార పార్టీ ప్రచారం జోరందుకుంది. క్షేత్రస్థాయిలో స్థానిక నేతల్ని తమ పరిధిలోని ప్రాంతాల ప్రచారానికి బాధ్యుల్ని చేసి వినూత్న స్థాయిలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. క్షేత్ర స్థాయిలో దేవరకద్రతో పాటు భూత్పూర్, కొత్తకోట మున్సిపాలిటీలలో మున్సిపల్ చైర్మన్లకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. చైర్మన్లు స్థానిక కౌన్సిలర్లు, నాయకుల్ని కూడకట్టుకుని తమ పరిధిలోని వార్డులతో పాటు శివారు గ్రామాలు, తండాలలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం కొనసాగించేలా చర్యలు చేపట్టారు. ఇక ఎంపిపిలు ఆయా మండలాల పరిధిలోని గ్రామాలు, తండాలలో విస్తృత ప్రచారం నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే ఆల సతీమణి ఆల మంజుల, సోదరుడు ఆల శశి వర్ధన్‌రెడ్డిలు భూత్పూర్ మండలంతో పాటు సమీప మండలాలైన మూసాపేట్, అడ్డాకుల, కొత్తకోట మండలాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారాలు నిర్వహించే ఏర్పాట్లు చేసుకున్నారు. భూత్పూర్ పట్టణంతో పాటు రూరల్ ప్రాంతాలలో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత డీసీసీ అధ్య క్షుడు జీఎంఆర్ తనదైన శైలిలో ప్రజలముందుకు వస్తున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్‌తో కలిసి మండలంలోని అన్ని ప్రాంతాలను కలియ తిరుగు తున్నారు. అధికార పార్టీని దుయ్యబడుతూ ఓటు బ్యాంకును సాదించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి సీనియర్ నేత కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ టికెట్ ఆశించి టికెట్ దక్కకపోవడంతో నైరాశ్యం చెంది అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.

దీంతో నియోజకవర్గంలోని కాటం వర్గీయులంతా బీఆర్‌ఎస్‌కు మద్దతు తెల్పుతుండడంతో కాంగ్రెస్ దేవరకద్రలో గట్టి పోటీనెదుర్కొనే పరిస్థితేర్పడిందని పలువురు రాజకీయ పరిశీల కులు భావిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి టికెట్టు నాశించి భంగపడి బీజేపీలో చేరి బీజేపీ నుంచి అనూహ్య రదీతిలో చివరిక్షణంలో టికెట్ తచ్చుకున్న కొండా ప్రశాంత్‌రెడ్డి డబుల్ ఇంజన్ సర్కార్ తేవాలనే తపనతో బీజేపీ తరఫున దేవరకద్ర అసెంబ్లీ స్థానం నుంచి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కొండా, జీఎంఆర్‌లు నామి నేషన్ల చివరి రోజు శుక్రవారం తమ నామినేషన్లు దాఖలు చేశారు. దేవరకద్ర అసెంబ్లీ స్థానం కోసం జరిగే ఈ ముక్కోణపు పోటిలో ముందడుగు ఎవరు వేస్తారన్నదే వచ్చే మూడో తేదీన తెల్సిపోతుంది. ముగ్గురభ్యర్థులలో దేవరకద్ర అసెంబ్లీ స్థానాన్ని గెల్చుకుంటారో వేచి చూడాల్సిందే..

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

●స్వేచ్ఛాయుత వాతావరణంలో జరపాలి ●ఎన్నికల పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు11 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా ఎన్నికల అధికారులు పని చేయాలని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు కలెక్టర్ సంజయ్ కుమార్ మిశ్ర అన్నారు. శనివారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాకు కేటాయించబడిన వ్యయ పరిశీలకులు డా. కుందన్ యాదవ్, డా. జి.వి. తేజస్వి, పోలీస్ అబ్జర్వర్, ఐపిఎస్‌అధికారిణి ఇళక్కియా కరుణాగరన్ లత కలిసి శాసనసభ ఎన్నికలపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, రిటర్నింగ్ అధికారులు, పోలీసులు నోడల్ అధికారులు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికలకు సంబంధించిన అధికారులు అందరు కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శాసన సభ ఎన్నికల సందర్భంగా ఇప్పటివరకు జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలు, అలాగే నవంబర్ 30వ తేదీన జరగనున్న పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై వివరించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ శాసనసభ ఎన్నికల సందర్భంగా పోలీస్ బందోబస్తు, పోలీస్ అధికారులు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై సాధారణ ఎన్నికల పరిశీలకులకు వివరించారు. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు డా. కుందన్‌యాదవ్, జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు డా. జి.వి తేజస్వి, పోలీస్ అబ్జర్వర్, ఐపిఎస్ అధికారిణి ఇళక్కియా కరుణాగరన్‌లు మాట్లాడారు. సమావేశంలో జడ్చర్ల రిటర్నింగ్ అధికారి ఎస్. మోహన్‌రావు, మహబూబ్‌నగర్ రిటర్నింగ్ అధికారి అనిల్‌కుమార్, దేవరకద్ర రిటర్నింగ్ అధికారి నటరాజ్‌తోపాటు, డిఆర్‌ఓ రవికుమార్, పోలీస్ నోడల్ అధికారులు, నోడల్ అధికారులు, ఏఆర్‌ఓలు హాజరయ్యారు. అనంతరం సాధారణ పరిశీలకులు వ్యయ పరిశీలకులు ఐడిఓసిలో ఏర్పాటు చేసిన ఎంసిఎంసి కేంద్రాన్ని అలాగే ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు.



సమావేశానికి హాజరైన అధికారులు

# ఎన్నికలు సజావుగా జరిగేలా పటిష్టంగా ఏర్పాట్లు చేయాలి

● వనపర్తి జిల్లా ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 11, ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గం లో ఎన్నికలు సజావుగా జరిగేలా పాటిష్టంగా ఏర్పాట్లు చేయాలని ఎన్నికల పరిశీలకులు జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అన్నారు. శనివారం ఆయన జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి తో కలిసి ఎన్నికల పరిశీలకులు జనరల్ అబ్జర్వర్ సోమేష్ మిశ్రా ఐ.ఏ.ఎస్, పోలీస్ అబ్జర్వర్ రాజీవ్ మల్హోత్రా, ఐ.పి.ఎస్ వనపర్తి జిల్లా ఎస్ పి కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ ను పరిశీలించారు. జిల్లాలోని సీసీ టీవీ సర్వేలన్స్, పోలీస్ బద్రతా వ్యవస్థ, పని తీరును జిల్లా ఎస్పి రక్షిత కే మూర్తి వివరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం ఉర్దూ మీడియం కళాశాలలో ఏర్పాటు చేసిన పిఎస్ 102,103 పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. చిట్యాలలోని వ్యవసాయ మార్కెట్ గోదాంలలోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్లో, రక్షణనిగా వ్యవస్థలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్‌ల ఏర్పాట్ల ఎన్నికల సిబ్బంది, రవాణా సదుపాయలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని, కౌంటర్లు ఏర్పాటు, టేబుల్స్ బారికెట్లను ఏర్పాట్లను చేయాలని, ఫైర్ సేఫ్టీ కోసం ముందస్తు చర్యలను చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు కావలసిన అన్ని ఏర్పాట్ల జరిగేలా తగు చర్యలు తీసుకున్నామని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి జాప్యం లేకుండా సజావుగా నిష్పక్షపాతంగా పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ గోదాంలలోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

## మొక్కజొన్న నూర్పిడి యంత్రం బోల్తాపడి మహిళ మృతి



బోల్తాపడిన నూర్పిడి యంత్రం, మృతురాలు స్వప్న

**లింగాల, నవంబరు11 ప్రభాతవార్త:** మొక్కజొన్న నూర్పిడి యంత్రం బోల్తా పడి స్వప్న (35) అనే మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ధారారం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పద్మనపల్లి గ్రామానికి నేనావత్ శక్రు అనే వ్యక్తికి నూర్పిడి యంత్రం ఉంది. దినసరి మాదిరిగానే కూలీ పనుల కోసం అదే గ్రామానికి చెందిన రవి భార్య స్వప్న (35) మరికొంతమంది కూలీలు శనివారం మొక్కజొన్న నూర్పిడి చేయడానికి మండల పరిధిలోని ధారారం గ్రామంలో ఓ రైతు వ్యవసాయ పొలంలో మొక్కజొన్న నూర్పిడి చేసి తిరిగి వేరే వ్యవసాయ పొలంలో నూర్పిడి చేయడానికి వస్తున్న క్రమంలో ఒక్కసారిగా టైరు ఊడిపోయి కిందపడింది. దీంతో మహిళపై నూర్పిడి యంత్రం పడడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిందని పోలీసులు తెలిపారు. మృతురాలికి ఒక పాపఉంది. భర్త ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి అచ్చంపేటకు తరలించారు.

## చెక్‌పోస్టుల పరిశీలన

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు11 ప్రభాతవార్త:** జిల్లాలోని జలాల్పూర్, ఎక్లాస్పూర్, కాన్‌కుర్తి, సమస్తపూర్, ఉజ్జెల్లి సరిహద్దు రాష్ట్ర చెక్‌పోస్టులను పరిశీలించారు. అక్కడ పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు ఏ విధంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వాహనాల తనిఖీల రికార్డుల నమోదు ఏ విధంగా చేస్తున్నారు. తనిఖీల సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకుని వాహనాల తనిఖీ రిజిస్టర్‌ను పరిశీలించారు. చెక్‌పోస్టు దగ్గర అధికారులు సమన్వయంతో ఉండి పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని డిఐజి సూచించారు.

## దేవరకద్ర బాలన్నకే బిసి సమాజ్ మద్దతు

బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎ. శ్రీనివాస్‌సాగర్



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 11 ప్రభాతవార్త :** దేవరకద్ర నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ తమ అభ్యర్థిగా దేవరకద్ర బాలన్న అంటూ చివరిక్షణం వరకు మాయ మాటలు చెప్పి, మూడు రోజుల క్రితం పార్టీలో జాయిన్ అయినా అగ్రకుల వర్గానికి టికెట్ కేటాయించడంపై బిసి సమాజ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుందని బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ సాగర్ తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న సగరుల పక్షాన ఉంటున్న దేవరకద్ర బాలన్నకే మా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. శ్రీనివాస్ సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడలేని విధంగా సగర ఉప్పరులు దేవరకద్ర నియోజకవర్గంలో దాదాపు 45 వేల మంది ఉన్నారు. ఈ దేవరకద్ర నియోజకవర్గంలో బిసి సమాజ్ ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, బిసి మేధావులతో గతంలోనే వివిధ రకాలుగా సర్వేలు నిర్వహించడం జరిగింది. అన్ని సర్వేలలో బిసిలు అత్యధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో బిసిలకు కేటాయించాలని మేము పోస్టర్ రూపంలో నియోజకవర్గంలో ప్రచారం చేయడం జరిగింది. ఈ బిసి కుల సంఘాలలో అత్యధికంగా ఉన్న సగర ఉప్పరులకు కేటాయించాలని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు విన్నవించడం జరిగింది. కానీ ప్రధాన రాజకీయ పార్టీలన్నీ బిసిలను అణగదొక్కే ప్రయత్నమే చేశాయి. బిసి ముఖ్యమంత్రి చేస్తామంటూ ప్రకటన చేసిన భారతీయ జనతా పార్టీ ఎంతవరకు బిసిలు గెలిచేచోట అభ్యర్థులు నిలబెట్టింది. ఎన్నిచోట్ల ఓడిపోయే దగ్గర సీట్లు ఇచ్చింది ఒకసారి ఆలోచించాలి. అత్యధికంగా ఓడిపోయే స్థానాలను బిసిలకు కేటాయించి బిసిలను మానసికంగా దెబ్బతీసే ప్రయత్నం పరోక్షంగా చేస్తున్న ఈ భారతీయ జనతా పార్టీకి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని శ్రీనివాస్ సాగర్ అన్నారు. కార్యక్రమంలో బిసి జర్నలిస్టు ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఆశన్న ముదిరాజ్, బిసి సమాజ్ కోకన్వీనర్ సత్యం, బిసిసమాజ్ పాలమూరు నియోజకవర్గం కో కన్వీనర్లు ఎస్. రాజేందర్‌గౌడ్, ఆర్. సత్యం, బిసి సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ బి. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కురుమయ్య నీ కొండకు వస్తున్నామయ్యా..

- నేటి నుంచి శ్రీకురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 14న స్వామివారి కళ్యాణోత్సవం, 18న అలంకరణోత్సవం, 19న ఉద్దాల మహోత్సవం

**చిన్నచింతకుంట, నవంబరు11 ప్రభాతవార్త:** పాలమూరు జిల్లా చిన్న చింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కాంచన గుహలో వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్స వాలు నేటినుంచి అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. పాలమూరు పల్లె బిడ్డల ఇలవేల్పు పేదల తిరుపతిగా శ్రీ కురుమూర్తి స్వామిని భక్తులు కొలుస్తారు. స్వామివారి బ్రహ్మోత్స వాలు తెలంగాణలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. శ్రీకురుమూర్తి స్వామిని తిరుపతి వెంకన్నలాగే భక్తులు విశ్వసిస్తారు. ఈనెల 29 వరకు బ్రహ్మోత్స వాలు కొసాగుతాయి. జాతర నెల రోజులపాటు జరుగుతుంది.

**బ్రహ్మోత్స వాలకు చకచకా ఏర్పాట్లు:** స్వామివారి బ్రహ్మోత్స వాలు జాతర నెల రోజులపాటు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్స వాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు ఆలయ పాలకమండలి ఏర్పాట్లను చకచకా చేపడుతున్నారు. బ్రహ్మోత్స వాలకు తరలివచ్చే భక్తులకు రవాణా సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులు జాతరలో భక్తులకు మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపడుతున్నారు. జాతరలో సిసి కెమెరాలు ప్రత్యేక పోలీసు బలగాలను ఉంచనున్నారు. బ్రహ్మోత్స వాలు ప్రధాన ఘట్టమైన ఉద్దాల మహోత్స వానికి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ఇప్పటి నుంచే భక్తులు కురుమయ్య నీ కొండకు వస్తున్నాం అయ్యా అంటూ సిద్ధమవుతున్నారు.



జాతర మైదానంలో వెలుస్తున్న దుకాణ సముదాయాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన స్వామివారి ప్రధానాలయం

**జాతర మైదానంలో వెలసిన దుకాణాలు:** స్వామివారి బ్రహ్మోత్స వాలు జాతర నెల రోజులపాటు కొనసాగుతుండడంతో జాతరలో వివిధ వ్యాపారాలు నిర్వహించేందుకు వ్యాపారస్తులు జాతర మైదానంలో దుకాణ సముదాయాలు వెలుస్తున్నాయి. హోటల్లు, మిఠాయి దుకాణాలు, రంగులు రాట్నాలు తదితర వ్యాపారస్తులు తమ దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

### 40 రోజుల మేఘారెడ్డి, 40 ఏండ్ల చిన్నారెడ్డి ఎలాంటి

# అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు!

- నోరు అదుపులో పెట్టుకోని మాట్లాడండి.. లేదంటే తగిన గుణపాఠం తప్పదు
- రాణి శంకరమ్మ తర్వాత చెరువుల పునరుద్ధరణ చేసిన ఘనత నిరంజన్‌రెడ్డిదే
- నీవు చేసే అభివృద్ధి గురించి ముందు ప్రజలకు చెప్పు
- వనపర్తి బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్



**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 11, ప్రభాతవార్త:** 40 రోజుల మేఘా రెడ్డి, 40 ఏండ్ల చిన్నా రెడ్డి వనపర్తి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయకుండా జబర్దస్త్, వీధి రౌడీలా మాట్లాడుతున్నారని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని నిరంజన్ రెడ్డి నివాసగృహంలో ఏర్పాట్లు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతున్న వనపర్తి ఎంతో మంది మేధావులతో ఎమ్మెల్యేగా ఎన్నుకోబడిందని, ముందు నీవు ప్రజలకు చేసే అభివృద్ధి గురించి మాట్లాడాలని హితవు పలికారు. నిరంజన్ రెడ్డి దయతో ఎంపీపీ అయిన నీవు ముందు నీ పదవికి రాజీనామ చేయాలని సూచించారు. గత ఏడాది నుంచి చిన్నా రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఆయనకు ఇంట్లో ఏ గొడవ జరిగిన నిరంజన్‌రెడ్డి పై అక్కసు కక్కుతున్నారని విమ ర్శించారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పార్టీకి పాలమూరులో పోటీ చేసే అర్హత లేకుండా దిగజారిపోయిందని, ఆ విషయాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని విమర్శించారు. వనపర్తి నియోజకవర్గంలో నిరంజన్ రెడ్డి చేసిన అభివృద్ధి కళ్ళముందు కనబడుతుందని, వనపర్తి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ. 80 కోట్లు కేసీఆర్ ను ఒప్పించి తెచ్చారని అన్నారు. మొదటి ఎమ్మెల్యే సురవరం ప్రతాప్ రెడ్డి నుంచి ఇప్పటి వరకు రాణి శంకరమ్మ తర్వాత చెరువుల పునరుద్దరణ చేసిన ఘనత నిరంజన్ రెడ్డికే దక్కిందన్నారు. విద్య, వైద్యం కోసం నిరంజన్ రెడ్డి ఎంతో కృషి చేశారని, అలాంటి మేధావి పై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తి లేదన్నారు. మేఘా రెడ్డి ఒక దగారెడ్డి అని, ఒగ్గు పర్వతాలకు రూ. 3 కోట్లు మోసం చేసిన విషయం అందరికీ తెలుసు అని. ముందు తోటి కాంట్రాక్టులకు అప్పులు కట్టాలని మండిపడ్డారు. విద్యాలయాలు తెచ్చిన ఘనత నిరంజన్ రెడ్డికే దక్కిందని, , నీకు అలా తెచ్చే దమ్ము నీకు ఉందా అని సవాల్ విసిరారు. మేఘా రెడ్డి, ఇతర చిల్లర నాయకులు చేసిన ఆరోపణలు, దాడులపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడం జరిగిందని. ఇప్పటి వరకు ఎలాంటి చర్య తీసుకోలేదన్నారు. పిర్యాదుపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర రిటర్నింగ్ అధికారులకు పిర్యా తు చేస్తామని అన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు పిచ్చి మాటలు మాట్లాడి రెచ్చగొడితే తగ్గిన గుణపాఠం తప్పదన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మెన్. గట్టు యాదవ్, మీడియా సెల్ ఇంచార్జి, నందిమల్ల అశోక్, రీజనల్ అథారిటీ సభ్యులు ఆవుల రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవి, నాయకులు సునీల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఫిర్యాదులను నేరుగా తెలియజేసుకునే అవకాశం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్11 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులకు సంబంధించిన ఏదైన ఫిర్యాదులు ఉంటే నేరుగా కానీ ఫోన్ ద్వారా అయిన తెలియజేయవచ్చునని కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించిన జనరల్ అబ్జర్వర్ మిథిలేష్ మిశ్రా ఐఏఎస్ శనివారం ఒక ప్రకటన ద్వారా కోరారు. అసెంబ్లీ సాధారణ ఎన్నికల దృష్ట్యా నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించిన ఫిర్యాదులు ఏవైన ఉన్నట్లు అయితే తమకు తెలియజేయాలని సాధారణ ఎనిన్కల జనరల్ అబ్జర్వర్ తెలిపారు. సాధారణ శాసనసభ ఎన్నికల దృష్ట్యా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎన్నికులకు సంబంధించిన ఉల్లంఘనలు, ఫిర్యాదులు ఏమైనా ఉన్నట్లు అయితే వాటిని స్వయంగా స్వీకరించడానికి ఉదయం 9 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు కొల్లాపూర్ సోమశిల లోని పర్యాటక వసతి గృహంలో అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. అదే విధంగా 89770 61896 నెంబరు ద్వారా తనకు ఫిర్యాదు చేయవచ్చునని, ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటానన్నారు. ఎవరైన ఫిర్యాదు చేయ దలచిన వారు స్వయంగాగాని లేదా ఫోన్ ద్వారా గాని ఫిర్యాదులు చేయవచ్చునని నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మిథిలేష్ మిశ్రా పత్రిక ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

## ప్రజలు ఓటుహక్కును వినియోగించుకోవాలి

●గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి




**గద్వాల ప్రతినిధి నవంబర్11 ప్రభాతవార్త:** ఓటు హక్కు అయుదమని, ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలందరూ ఓటు హక్కు పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం సాధారణ ఎన్నికలలో సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై ప్రజలలో పూర్తి అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాలలో భాగంగా గద్వాలలోని రాజీవ్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్ మోడల్ లను ప్రారంభించారు. ఐడిఓసి కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ఐ ఓటు ఫర్ సూర్ అనే సెల్ఫీ పాయింట్ ను అదనపు కలెక్టర్ అపుర్వ చౌహాన్‌లతో కలిసి ప్రాంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భరత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతిఒక్కరు కచ్చితంగా వినియోగించు కోవాల్సి న బాధ్యత ఉందన్నారు. ఓటు యొక్క ఆవశ్యకతను వివరిస్తూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఓటు వేయడం ద్వారా మంచి ప్రతినిధిని ఎన్నుకోవచ్చని అన్నారు. ఓటు హక్కు ప్రాధాన్నత ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, ఎన్నికల్లో ఎలాంటి ధన, ప్రలోభాలకు లొంగకుండ స్వేచ్చా యుతంగా ఓటు ను వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, స్వీప్ నోడల్ అధికారి రమేష్ బాబు, డిపిఆర్‌ఓ చెన్నమ్మ, ఎం.ఆర్ నరేందర్ పాల్గొన్నారు.

## కబడ్డీ పురుషుల టీం సత్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 11 ప్రభాతవార్త :** సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాలమూరు విశ్వవిద్యాలయం కమిటి జట్టు సత్తా చాటింది. చరిత్రలోనే తొలిసారి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నది. ప్రీతి యూనివర్సిటీ తమిళనాడుపై 43, 42 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించినట్లు యూనివర్సిటి పిడి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ బిసి లక్ష్మికాంత్ రాథోడ్ రిజిస్టర్ గిరిజ మంగతాయారు ఎంబిఎస్ కళాశాల పిడి సత్యభాస్కర్‌రెడ్డి, కోచ్ మల్లేష్, మేనేజర్ వెంకటప్ప, కబడ్డి అసోసియేషన్ సభ్యులు రాజావర్ధన్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిని కాపాడుకుందాం!



పాఠశాలలో దీపావళి సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

**నారాయణపేట ప్రతినిధి,నవంబరు11 ప్రభాతవార్త:** శ్రీ ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో నడు దీపావళి సంబరాలు చేసుకోవడం జరిగింది. ఇందులో భాగంగా ప్రకృతిని కాపాడుకునేందుకు టపాకాయలు బాణాసంచా కాల్చ కూడదని ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని విద్యార్థులు ప్లకా ర్డులతో సమాజానికి తెలియజేయడం జరిగింది. ప్రకృతి అమ్మఒడి లాంట దని ప్రతి ఒక్కరు సహజన వనరుల నుండి లభించే వాటినుండి అరు దైన ఔషధాలు తయారు చేయడం జరుగుతుందని అటువంటి ప్రకృతిని కాపాడు కోవాలని ప్రిన్సిపల్ మహేశ్వరి విద్యార్థులకు తెలిపారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో దేశానికే మోడల్ తెలంగాణ

**కొత్తకోట,నవంబర్ 11,ప్రభాతవార్త :** ఎన్నో ఆకాంక్షలతో ఆశయాలతో ఉద్య మించి స్వరాష్ట్రం ఏర్పాటు చేసుకున్న గడిచిన పదేళ్ల పాలనలో సంక్షేమ తెలంగాణ సహకారం అయింది సబ్బండ వర్గాల అభివృద్ధి ధ్యేయంగా పాల న అందిస్తున్నారని భారత జాగృతి వనపర్తి జిల్లా యువజన విభాగం కన్వీనర్ దాసరి విజయ్ ముదిరాజ్ అన్నారు.అనేక రంగాల్లో ముందుకు పోతున్న తెలంగాణ ఒక సమిలిత అభివృద్ధి తోని రైంతగాని సంక్షేమాన్ని కాకుండా పారిశ్రామిక విధానంలో లక్ష కోట్లు పెట్టుబడులను ఆకర్షిస్తూ దేశం లోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ సమగ్ర జీవన ప్రమాణాల పెంపు లక్ష్యం విశేష కార్యక్రమాలు గతంలో రాష్ట్ర ఏర్పడితే నష్టపోతామని అవహేళన చేసిన దేశనుంచి దేశంలోఅత్యధిక సంక్షమ పథకాలు అందిస్తున్న రాష్ట్రంగా నేడు అభివృద్ధిలో దేశానికి మోడల్ గా నిలిచిన రాష్ట్రంగా తెలం గాణ అవతరించిందని చెప్పారు.సర్వతోముఖభివృద్ధి కోసం సంపద పెంచాలి .పెరిగిన సంపదను అవసరమైన వర్గాల ప్రజలకు పంచాలి అన్న ధ్యేయం తో తెలంగాణ ప్రభుత్వం ముందడుగు చేస్తున్నదని తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన పాతపల్లి గ్రామస్తులు



**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 11,ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం పాతపల్లికి చెందిన బిఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షుడు,రాధా కృష్ణ,గ్రామ సర్పంచ్ రవీం దర్ నాయుడు,పెబ్బేరు మండల మాజీ బిఆర్ఎస్ అధ్యక్షులు పి వెంకట రమణ సారథ్యంలో 30 మంది బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ అభ్యర్థి మేఘారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వీరికి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాధారణంగా ఆహ్వానించారు.

## ఘనంగా వాసవిమాత పల్లకిసేవ

**-అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు**



**దేవరకద్ర,నవంబరు11 ప్రభాతవార్త:** దేవరకద్ర లోని శ్రీ వాసవి కన్య కాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి అమ్మవారి పల్లక సేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహిం చారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగం గానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం సంద ర్భంగా ఈ పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వ హించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తులు హరినామశ్చరణల మద్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.స్థానిక ఆర్య వైశ్య సంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన:** దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకు మార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామ పారా యణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామతాలతో అమ్మ వారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళహారతి, ప్రసాద విత రణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవ స్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి,మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యల తో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల వాష్ రూమ్ (బాత్రూం) డోర్లను పగలగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

**◆గట్టు ఎస్సైను కలిసి ఫిర్యాదు చేసిన గ్రామ యూత్ సభ్యులు**



**గద్వాల ప్రతినిధి నవంబర్11 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా నియోజకవర్గం గట్టు మండల బోయల గూడెం గ్రామంలో ఓ కంపెనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థు లకు వాష్ రూమ్ (బాత్రూం) లను నిర్మించింది..రెండు రోజుల కింద ఈ వాష్ రూమ్ లను ప్రభుత్వ పాఠశాల ఉపా ధ్యాయులు ప్రారంభించారు.. అయితే రెండు రోజులు కాకముందే వాష్ రూమ్‌లకు ఉన్న డోర్లను గుర్తు తెలయని దుండగులు అర్ధరాత్రి పగల గొట్టారు. ఈ విషయంపై గ్రామ యూత్ సభ్యులు గట్టు ఎస్సైను కలిసి ఫిర్యాదు చేసి, నిందితులను కఠి నంగా శిక్షించాలని వారు కోరారు.ఈ సంద ర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇబ్బంది ఉండ టంతో ఓ కంపెనీ వారు వాష్ రూమ్‌లను కట్టి స్తే, వాటిని ప్రారంభించిన రెండు రోజులకే కూలగొట్టడం సరికాదని అన్నారు.. బాత్రూం డోర్లను పగలగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల ని యూత్ సభ్యులు డిమాండ్ చేశారు.. పోలీస్ సమగ్ర విచారణ జరిపి ఈ సంఘటనకు పాల్ప డిన దుండగులను కఠినంగా శిక్షించాలనివారు కోరారు.కార్యక్రమంలో వాల్మీ కి గ్రామ అధ్యక్షుడు బీకే లింగన్న, చిన్న రాముడు, అజిత్ , పుల్లయ్య గౌడ్, కిట్టుగౌడ్, శంకర్, మాల శేకర్, జంగం వీరేష్, వడ్డే వీరేష్, ఉప్పరి మంజునాథ్, హనుమంతురెడ్డి, గండ్లవినోద్, అమరవాయి శీను, బోయ నాగరాజు, వాల్మీకి ప్రధాన కార్యదర్శి వేణు, బీకేవీరేశ్, తెలుగునరేష్, కప్పంటి నరసింహులు, భాగం మగధీర,గ్రామ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




గట్టు ఎస్సైను కలిసి ఫిర్యాదు చేసిన గ్రామ యూత్ సభ్యులు

# దైవచింతనతో మనిషి జీవితం ధన్యం

**-హల్దీపూర్ వైశ్యగురు పీఠాదిపతి వామనాశ్రమ మహాస్వామిజీ**

**-దేవరకద్ర వాసవిమాత అలయంలో కోటిపుష్పార్చన పూజ**

**దేవరకద్ర,నవంబరు11 ప్రభాతవార్త:** దైవచింతనతోనే మనిషి జీవితం ధన్యమవుతుందని కర్ణాటకలోని హల్దీపూర్ వైశ్యగురు పీఠాదిపతి శ్రీశ్రీశ్రీ వామనాశ్రమ మహాస్వామిజీ అన్నారు.అందుకే ప్రతి ఒక్కరు దైవచింతనకు సమయాన్ని కేటాయించాలని స్వామిజీ అన్నారు. దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రా త్రి జరిగిన కోటి పుష్పార్చన పూజా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 9వ దేవస్థానమైన దేవరకద్ర వాసవిమాత అలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని భక్తులను ఆశిర్వదించడానికి వామనాశ్రమ మహాస్వామిజీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.ప్రతి ఒక్కరు నమ్మకాన్ని వమ్ము చేసుకోరాదన్నారు. న్యాయం గా మసలు కోవాలన్నారు.ఆధ్యాత్మికతను అలవర్చుకోవడానికి ప్రయ త్నించాలన్నారు.ప్రతి రోజు దైవగ్రంధాలను చదువడానికి ప్రయత్నిం చాలి.అలాగే దాని అర్థం కూడ చేసుకోవాలన్నారు.పాపాలకు దూరం గా ఉండాలన్నారు.మంచి పనులు చేయడానికి ప్రయత్నించాలన్నారు. కల్మశం లేని జీవితాన్ని అనుభవించాలన్నారు.అప్పుడే మనిషి జీవి తానికి సార్ధకత చేకూరుతుందన్నారు.భగవత్‌నామస్మరణను ఎవరు చేస్తారో వారి భక్తికి దేవుడు సంతోషం చెంది వారి మనసులోని అజ్ఞా



భక్తులను ఆశీర్వదిస్తున్న వామనాశ్రమ మహాస్వామిజీ



పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

నం రూపంలో ఉన్న అంధకారాన్ని తొలగించి జ్ఞానదీపాన్ని వెలిగి స్తాడన్నారు.మనిషి జీవితంలో ముఖ్యంగా ఏం చేయాలంటే అజ్ఞా నాన్ని తొగించుకోవాలన్నారు.చెడును దరిచేరకుండా చూడాలన్నారు. మంచి వైపే పయనించాలన్నారు.ఈ సందర్భంగా దేవస్థానంలో అమ్మ వారికి కోటి పుష్పార్చన పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

**దేవాయంలో వామనాశ్రమ మహాస్వామిజీ పూజలు:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి కర్ణా టకలోని హల్దీపూర్‌లోని వైశ్యగురు పీఠాదిపతి శ్రీశ్రీశ్రీ వామనాశ్రమ మహాస్వామిజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన భక్తులకు ఆశిర్వచన ం పలికారు.అనుగ్రహ భాషణం చేశారు. యతీంద్రులు,అనుగ్రష భాష్యలతో భక్తులు సుసంపనం చేసుకొ న్నారు.స్వామి వారి అనుగ్రహ భాషణం విని దేవాలయంలో భక్తులు ఎంతగానో భక్తిపారవశ్యంతో పులకించిపోయారు.ఈ కార్యక్రమంలో దేవస్థానంకమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి,మహిళాసంఘం అధ్య క్షురాలు గుద్దేటి మంజులరాణీ, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్య క్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు అలయ నిర్వహణ కమిటి సభ్యు లు,ఆర్యవైశ్య యువజన సంఘం,మహిళా సంఘం, ఆవోపా,కిరాణ మర్చంట్ అసోసియేషన్,మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు,స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# మన్యంకొండలో కన్నులపండువలా తిరుచ్చిసేవ

**దేవరకద్ర,నవంబరు11 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యం కొండ శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదా యరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తులహరినామశ్చరణ,కాగడాలవెలుతురులో స్వామి వారిసేవ ముందుకు కదిలింది.ఈ సేవను చూసిభక్తులు భక్తి పారవ శ్యంతో పులకరించిపోయారు.ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు.అక్కడ వివిద పూజల ను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు:** మన్యంకొండలో తిరుచ్చి సేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూధేవి సమేతంగా ఊరేగుతూ అలం కరణలో భక్తకోటికి దర్శనమి చ్చారు. రకం కాలపూలు, బంగారు ఆభరణాల తోస్వామి వారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలు మూలల నుండి భక్తులు మన్యం కొండకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం



చైర్మెన్ అళహరి మధు సూధన్‌కుమార్,అళహరి రామ కృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బొడ్రాయి ఉత్సవాలను విజయవంతం చేయాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణంగౌడ్**

**అమరచింత,నవంబర్ 11,ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని ఈ నెల 14,15,16 మూడు రోజులు పాటు జరిగే ఉత్స వాలను విజయవంతం చేయాలని అమరచింత మున్సిపల్ చైర్పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్ అన్నారు.శనివారం అమరచింత మున్సి పల్ కేంద్రంలో మార్కండేయ దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావే శంలో ఆమె మాట్లాడుతూ,అమరచింత పట్టణంలో ఆయా వార్డులలో 8 బొడ్రాయి నూతన విగ్రహవిష్కరణలు ఏర్పాటు చేశామని ఆయా వార్డుల ప్రజలు భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని ఆమె అన్నారు.అలాగే ఆయా వార్డులలో బొడ్రాయి నూతన విగ్రహావిష్కరణకు వచ్చే భక్తులకు అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్ తెలిపారు.మూడు రోజులు పాటు జరిగే బొడ్రాయి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్

మహోత్సవాలు ప్రజలుశాంతియుతంగా జరుపుకోవాలని ఆమె ప్రజల ను కోరారు.ఈ కార్యక్రమంలో బొడ్రాయి ఉత్సాహ కమిటీ నిర్వాహకులు తాటికొండ రమేష్,ఏకే వెంకటేశ్వర్ రెడ్డి,కొంగరి కృష్ణమూర్తి,కడియాల పెద్ద నరసింహులు,రామ్మూర్తి,కుమ్మరిశ్రీను,విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేసిన కేసీఆర్

**వనపర్తి ప్రతినిధి, నవంబర్11,ప్రభాతవార్త:** నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పి స్తామని కేసీఆర్ మోసం చేశారని.వనపర్తిలో కాంగ్రెస్ అభ్యర్థి మేఘా రెడ్డి గెలుపుకు టీడీపీ పార్టీ కార్యకర్తలు మద్దతు వుంటుందని తెలుగుదేశం పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అధ్యక్షులు రాములు అన్నా రు.శనివారం జిల్లా కేంద్రంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో మేఘా రెడ్డిని టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు అందరూ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న తూడి మేఘారెడ్డికి సపోర్ట్ చేస్తూ ఆయన గెలుపుకు కృషి చేయా లన్నారు.తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు చేసింది ఏమీ లేదనీ, రైతులకు సబ్సిడీలు లేకుండా చేసిందని..రైతుబంధు పేరిట వందల ఎకరాలు భూములు కలిగిన రైతులకు లబ్ది చేకూర్చిందన్నారు. నిరుద్యో గులకు ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేసిందని,ఇలాంటి బిఆర్ఎస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ మేఘారెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరు మనస్ఫూర్తిగా కృషి చేయాలని ఆయన కోరారు.ఇందుకు స్పందిం చిన మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అభినందనలు తెలియజేస్తూ ఎక్కడ ఎలాంటి తేడా లేకుండా అందరిని సమానంగా చూస్తూ తన గుండెల్లో పెట్టుకుంటానని వారికి హామీనిచ్చారు.ఈకార్యక్రమంలో ఎంపీ పీ కిచ్చారెడ్డి,మాజీ జెడ్పిటిసి వెంకటయ్య యాదవ్,నాగర్కర్నూల్ పార్ల



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి పార్టీ నాయకులు

మెంట్ ప్రధాన కార్యదర్శి వెల్టూర్ శ్రీనివాస్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి,గౌడ సంఘం జేపీసీ జిల్లా అధ్యక్షులు రామస్వౌడ్ పెద్ద మందడి మండల ఉపాధ్యక్షులు హుస్సేన్,ఖిల్లా గణపురం మండల తెలుగు యువత అధ్యక్షులు శ్రీనివాసులు,రాములు,గంధం రాజు, అప్ప యపల్లి సింగిల్ విండో డైరెక్టర్ బాలయ్య,ఉప సర్పంచ్ యాదగిరి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ చిన్నయ్య,మాజీ కౌన్సిలర్ ఆవుల శ్రీనివా సులు,పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు హొటల్ బలరాం యాదవ్,వాటర్షెడ్ చైర్మన్ శ్రీనివాసులు జి బాలయ్య జంగన్న పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ఓటుహక్కును వినియోగించుకోవాలి

**నారాయణపేట ప్రతినిధి,నవంబరు11 ప్రభాతవార్త:** ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకే శాంతియుత వాతావరణంలో ఎన్ని కలను నిర్వహించడానికి జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో (ఎస్ఎస్‌బి) ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరుగుతుందని ప్రజలకు ప్రశా ంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం అని ఆర్ఐ శేఖర్‌బాబు తెలిపారు. శనివారం సాయంత్రం మరికల్ ఎస్సై హరిప్ర సాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మరికల్ మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన చిత్తనూరు, ఎక్లాస్‌పూర్ గ్రామాలలో పోలీసులు, కేంద్ర సాయుధ బలగా లతో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సంద ర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణం లో నిర్వహించేందుకు ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఆ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని అలాగే ప్రజలందరికి జిల్లా పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని ప్రజల్లో ధైర్యాన్ని కల్పించ డానికి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరిగిందని ఆర్ఐ తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధైర్యంగా ఓటుహక్కును వినియోగించు కోవాలని సూచించారు.ఈ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడమే లక్ష్యంగా ఈ ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించడం జరుగుతుంది. ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలు కీలక పాత్రను పోషిస్తాయని పోలింగ్ కేంద్రాలలో సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీస్ సిబ్బంది విధులను నిర్వహిస్తుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి, కేంద్ర సాయుధ బల గాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

**అమరచింత,నవంబర్ 11,ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ పట్టణానికి చెందిన మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు రవికాంత్,చిన్నా రాజ్ గౌడ్,అంజి గౌడ్,చికెన్ శీను వారి అనుచరులతో పిసిసి రాష్ట్ర అధికారి ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్,మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్లో చేరారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కేశం నాగరాజ్ గౌడ్,వాకిటి శ్రీహరి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.మక్తల్ నియోజకవర్గం నుండి బడుగు బలహీన వర్గాల వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి గెలుపు కోసం కృషి చేస్తామని వారు తెలిపారు.

## ఘనంగా మౌలానా అబ్దుల్ కలాం జయంతి




**కల్వకుర్తి, నవంబర్ 11, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని వైఆర్ఆర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో దేశ మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబ్దుల్ కలాం 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మౌ లానా అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ వ్యక్తులలో ఆయన ఒక రని, స్వాతంత్ర్య ఉద్యమంలో పాలు పంచుకున్న మహనేత అని కొనియా డారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడువాలన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ షాహేద్, మున్సిపల్ కౌన్సిలర్లు రవి, నూనె యాదమ్మ, శ్రీను, నాయకులు నాగేష్‌గౌడ్, గజ్జె శేఖర్, యాద గిరి, మైనార్టీ నాయకులు హసన్, ఖాదర్, జనతా ఖాదర్, సాధిక్, కల్వకుర్తి బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు, బీఆర్ఎస్ అనుబంధ కమిటీ సభ్యు లు, మైనార్టీ సెల్ నాయకులు తదితరులు ఉన్నారు.

## మక్తల్‌లో అభివృద్ధి శూన్యం: వాకిటి శ్రీహరి



**మాగనూరు,నవంబరు 11 ప్రభాతవార్త :** టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మక్తల్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి విమర్శించారు. శుక్రవారం ఆయన ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ అభివృద్ధి చేసిన దాని కంటే దోచుకున్నదే ఎక్కువని ఆరోపించారు. రైతు రుణమాఫీ, డబుల్ బెడ్ రూం ఇండ్ల హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. మక్త ల్‌కు మంజూరైన డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్, కోర్టులను వాడుకోకుండా తిరిగి పంపించిన ఘనత చిట్టెం రామ్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇంత టి అసమర్థ ఎమ్మెల్యే మన రాష్ట్రంలోనే ఎక్కడ ఉండరని మండిపడ్డారు. మక్తల్ అభివృద్ధికి వచ్చిన వనరులను వాడుకోకుండా వెనక్కి తిరిగి పంపిం చిన నాయకుడిని కూడా ఇంటికి పంపించాలని కార్యకర్తలను కోరారు. సంక్షే మ పథకాల ప్రయోజనాలు బిఆర్ఎస్ కార్యకర్తలకు అందాయి తప్ప సామా న్య ప్రజలకు అందలేదన్నారు. తనకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామ న్నారు.కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, రవికుమార్ యాదవ్, శివరాంరెడ్డి, ఆనంద్‌గౌడ్, విజయప్పగౌడ్, నరసింహారెడ్డి, రవి, దూళ్ల తిప్పయ్య, బాల దాస్ వేణులతో పాటు ఉమ్మడి మాగనూరు, కృష్ణ మండలాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపిఎం అధికారి బిచ్చన్న, ఐకెపి మహిళా సంఘం సభ్యులు

**వీపనగండ్ల,నవంబర్ 11,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల పరిధిలోని రంగ వరం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారం భించుకోవడం జరిగింది.ఈ కేంద్రాన్ని ఏ.పి.ఎం అధికారి బిచ్చన్న.ఐకెపి సంఘం మహిళలతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సంద ర్భంగ ప్రభుత్వ అధికారి బిచ్చన్న మాట్లాడుతూ..ప్రభుత్వం వరి ధాన్యానికి ఏ గ్రేడ్ ధాన్యమైతే 2203/ రూపాయల మద్దతు ధర,బి గ్రేడ్ రకం అయితే 2183/ రూపాయలు మద్దతు ధర ప్రభుత్వం ఇస్తుందని తెలియ జేశారు, అదేవిధంగా రైతులు అందరూ క్రమ పద్దతిలో ఎలాంటి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని,రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సి.సి వీరయ్య తో పాటు,గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు సువర్ణ,రైతులు యాదవ స్వామి,నరసింహ,మోహన్ రెడ్డి,తదితర రైతులు పాల్గొన్నారు.

## విశ్వరూప మహాసభకు తరలిన ఎస్సీలు



**శ్రీరంగాపురం మండలం,నవంబర్11,ప్రభాతవార్త:** ఎస్సి కులాల ఎ,బి,సి,డీ వర్గీకరణ కోసం శనివారం సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరిగే మాది గ,మాదిగ ఉప కులాల విశ్వరూప మహా సభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరవుతున్నారని,ప్రతి గ్రామంనుంచిఎస్సీలు తరలిరావాలని మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు మండల కేంద్రంలో ని ఎస్సి కాలనీ నుండి లెక్చరర్ జె.కురుమూర్తి ఆధ్వర్యంలో ఎస్సి కాలనీ ప్రజలు తరలి వెళ్ళారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

**కొత్తకోట,నవంబర్11,ప్రభాతవార్త:** కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామా నికి చెందిన రావుల భరత్ రెడ్డి ఆధ్వర్యంలో 50 మంది,గంగాధర్ ఆధ్వ ర్యంలో 40 మంది,ధనుష్,కుర్మయ్య ఆధ్వర్యంలో 15 మంది దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. నాగ రాజు,రాంచంద్రి,చిరంజీవి,మహేందర్,రమేష్,మన్యం,లక్ష్మయ్య,రాజు.నరేష్ ,నాగమ్మ,మోహన్,శ్రీను,సురేష్,మోహన్ తో పాటు కాంగ్రెస్ పార్టీ కి చెందిన 105 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు.బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దేవరకద్ర నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధికి ఆకర్షి తులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాటం ప్రదీప్ కుమార్ గౌడ్,సర్పంచ్ రావుల సుదర్శన్ రెడ్డి,నారోత్తం రెడ్డి,రావుల గోపాల్ రెడ్డి,మురళిధర్ రెడ్డి,వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు,ఉప సర్పంచ్ వడ్డే రాములు,ఉప్పరి యాదన్న,రావుల రఘువర్ధన్ రెడ్డి,రమేష్ రెడ్డి,భాస్కర్ చారి,శేఖర్ గౌడ్,అంజన్న,గ్రామ అధ్యక్షుడు హొటల్ రాజు,ఉపాధ్యక్షుడు గోవర్ధన్,శాంతన్న,డిసి రాములు,నాగరాజు పాల్గొన్నారు.

**భూత్పూర్,నవంబర్ 11,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం రావులపల్లిలో పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు,కార్యకర్తలు శనివారం బీఆం ఎస్ దేవరకద్ర అసెంబ్లీ అభ్యర్థి,సిట్టింగ్ ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆం ఎస్‌లో చేరారు.గ్రామ సర్పంచి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వీరంతా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అన్నాసాగర్‌కు వెళ్లి ఎమ్మెల్యే ఆలచే గులాబీ కండువా కప్పుకున్నారు.బీఆర్ఎస్‌లో చేరినవారిలో కావలి వెంకటేష్ ,ప్రవీణ్‌కుమార్, పాగం నవీన్,శివ,శ్రీధర్,సురేందర్, నవీన్‌కుమార్,రాజేష్, మహేష్‌కుమార్, గిరిప్రసాద్,బాలరాజ్,అజయ్,నందీశ్వర్,కిషన్,రామాచారి,అంజనేయులు తదితరులున్నారు.బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించినట్లుసర్పంచి శ్రీనివాసులుతో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యే,బీఆర్ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

